క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న ఎంపీపీ ప్రమీల దంపతులు

గుర్ల: మండలంలోని గూడెం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బాబాను ఎంపీపీ దంపతులు పొట్నూరు ప్రమీల, సన్యాసినాయుడు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాలతో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చీపురుపల్లిరూరల్: త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయనగరం కమిటీ ఆధ్వర్యంలో చీపురుపల్లి పట్టణంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై మంగళవారం ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యుడు శంకరరావు మాట్లాడుతూ సర్వమానవాళికి సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో ఉందన్నారు. త్రైతసిద్ధాంత భగవద్గీతను చదివి కర్మయోగం విశిష్టతను, ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు ప్రసాద్, సి.వి.ఎస్.నాయుడు, దుర్గారావు, కోటి, సూరిబాబు, రాజేష్, శ్రీను, వంశీ, రాజప్పడు, భానుమతి, పుణ్యవతి, జయలక్ష్మి, మీన, ప్రమీల, బంగారమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ



దాతలు అందజేసిన క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నంకు చెందిన డాక్టర్ పి.మైథిలి,డాక్టర్ బి.సాంబశివరావు రూ.10వేల విలువైన వివిధ రకాల క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని దాతలు ఈ సామగ్రిని అందజేశారని హెచ్ఎం పద్మావతి తెలిపారు. దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. 'నాభూమి –నాదేశం' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం వారు మొక్కలు నాటారు. చెరువు గట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



రైతులకు అవగాహనకల్పిస్తున్న డీపీఎం ఆనంద్

వేపాడ: అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ డీపీఎం పి.ఆనంద్ అన్నారు. కుమ్మపల్లి గ్రామంలోని మామిడి తోటల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆకుకూరలు, కాయగూరల పంటల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను, ఏడాది పొడవునా ఆదాయం సమకూర్చే పంటలను సాగుచేసే విధానాలను రైతులకు డీపీఎం వివరించారు. ప్రకృతి వ్యవసాయ యాంకర్ సన్యాసమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేషన్ డిపోపై విజిలెన్స్ దాడులు

కొత్తవలస: మండలంలోని ఉత్తరాపల్లి గ్రామం రేషన్ డిపో–1పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. రికార్డుల ప్రకారం డిపోలో ఉండాల్సిన సరుకుల కంటే 16 క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటాళ్ల పంచదార తక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డిపో డీలర్ బండ రామయ్యమ్మపై 6–ఏ కేసు నమోదు చేశామని సీఎస్‌డీటీ కె.ఇందిర తెలిపారు. డిపోలో ఉన్న సరుకులను నిమ్మలపాలెం గ్రామానికి చెందిన డిపో నంబర్–16కు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మెరకముడిదాం: ఎం.రావివలసలో మహిళకు పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో మళ్లీ అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆపార్టీ నేతలు బూటకపు హామీలు ఇస్తున్నారని, వారి మాయమాటలను నమ్మవద్దని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండలంలోని ఎం.రావివలస గ్రామంలో మంగళవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి జంక్షన్ నుంచి రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించనున్నామని, అలాగే 40 నుంచి 50 ఎకరాల్లో రూ.500 కోట్లతో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలానికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా సాగునీటిని అందించనున్నామని చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే లభిస్తున్నాయని, ప్రజలకు మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనితప్పిందన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి చంద్రబాబునాయుడు ఓర్వలేక, ప్రజల దృష్టిని మరల్చేందుకు, ఏమార్చేందుకు ఇటీవల బూటకపు యాత్ర ఒకటి ప్రారంభించారని మండిపడ్డారు. యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చి తోటపల్లి కాలువతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు తానే కట్టానని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తాడని, వాటిని నమ్మవద్దని ప్రజలను కోరారు. నిజమైన సంక్షేమం, అభివృద్ధి ఎవరు చేస్తున్నారో గుర్తించాలన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ జెడ్పీ చైర్మన్ వెళ్లారు. పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరాతీశారు.కొన్ని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, స్థానిక సర్పంచ్ పిన్నింటి శ్రీహర్ష, ఎంపీటీసీ పిన్నింటి సన్యాసినాయుడు, నాయకులు పప్పలకృష్ణమూర్తి, పిన్నింటిబాల, ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఏఈలు రమణమూర్తి, పార్వతి, ఏఓ శ్రావణితేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం : ఎమ్మెల్యే కడుబండి

జామి: అన్ని వర్గాల అభ్యున్నతికి అవసరమైన పథకాలను అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవం సృష్టించారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జామి సచివాలయం–3 పరిధిలోని విఘ్నేశ్వర కాలనీ, కొత్తలివారి కల్లాలు, వర్రివాని కల్లాలు తదితర ప్రాంతాల్లో మంగళవాం 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం దేశంలో ఏరాష్ట్ర ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను మన రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. మండల జేసీఎస్ ఇన్‌చార్జి శీరెడ్డి చందునాయుడు, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఎంపీటీసీ సూరిదేముడు, నాయకులు అల్లు సత్యాజీ, అల్లు అప్పలనాయుడు, శింగారపు అప్పలరాజు, ఎంపీడీఓ సతీష్,ఎ ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తక్షణ సహాయం అందజేత

జామి గ్రామానికి చెందిన సుంకరి అమ్మాజీ భర్త వెంకటరావు ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అందజేశారు. బీమా మిగతా పరిహారం త్వరలో అందించనున్నట్లు తెలిపారు.



జామి: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- అధికారులకు జెడ్పీ చైర్మన్ ఆదేశం

గుర్ల: గ్రామాల్లో అభివృద్ధి పనులను, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివా సరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావే శానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించగా... సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీ చైర్మన్ అధికారులతో చర్చించి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యను పరిష్కారించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆనందపురం నుంచి నెల్లిమర్ల మండలం పూతికపేట గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.54 కోట్లు మంజూరయ్యాయని సంబంధిత అధికారి సభకు వివరించారు. మండలంలో 575 మంది కొత్తగా ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారని హౌసింగ్ ఏఈ రామచంద్రరావు తెలిపగా.. ఇది వరకు ఇళ్లు మంజూరు చేసిని వారిలో ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారి వివరాలు ఆన్‌లైన్‌లో తొలగించి కొత్తవారికి మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఎంపీడీఓ కల్యాణి, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో ముందంజ



మాట్లాడుతున్న శ్రీనివాసులనాయుడు

శృంగవరపుకోట: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడి, వాటిని పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందు నిలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు చెప్పారు. స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో పీఆర్టీయూ మండల కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ గతంలో అప్రెంటిస్ పీరియడ్‌ను నోషనల్ ఇంక్రిమెంట్‌గా మంజూరు చేయించామని, సీఆర్పీ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా అనియత విద్యలో పనిచేసి, అర్హత ఉన్న వారిని సీఆర్పీలుగా నియమించడంలోనూ, ఎంటీఎస్ ఉపాధ్యాయుల నియామకాల్లో సంఘం చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు కె.మోహన్‌రాజ్, జి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింట సర్వేకు సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: మండలంలో ఇంటింట ఓటర్ల జాబితా సర్వే చేస్తున్న బీఎల్‌ఓల(బూత్‌లెవెల్ అధికారులు)కు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ ఎం.అరుణకుమారి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. బీఎల్‌ఓలు సర్వే చేసేటప్పుడు వారి వెంట పార్టీలకు సంబం ధించిన బీఎల్‌ఏలు(బూత్ లెవెల్ ఏజెంట్లు), నాయకులు వెళ్లాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, వారి పేర్లు, చిరునామా, ఇతర వివరాలన్నీ సరిపోయాయో లేదో సరి చూడాలని చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన వారికి ఒకే పోలింగ్ కేంద్రంలో కాకుండా వేర్వేరు చోట్ల ఓట్లు ఉంటే సరి చేయాలని, చనిపోయిన వారు ఉంటే జాబితా నుంచి తొలగించాలని సూచించారు. 18ఏళ్లు నిండిన వారందరితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని కోరారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని రాచపేట గ్రామానికి సిరిదేవిపురం నుంచి రూ.1.50 కోట్లతో తారు రోడ్డు నిర్మా ణానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని, లింకు రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, సర్పంచ్ అప్పలనాయుడు, పీఆర్ డీఈ రమణమూర్తి, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

సాగునీటి కాలువల పరిశీలన



దెబ్బతిన్న సాగునీటి కాలువను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

గంట్యాడ: బొడ్డవర గ్రామం నుంచి విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిలో భాగంగా పెంటశ్రీరాం, తామరపల్లి గ్రామాలకు వెళ్లే సాగునీటి కాలువలు దెబ్బ తిన్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆ కాలువలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువలకు ఇబ్బంది లేకుండా రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కాలువలను తక్షణమే బాగుచేయించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ స్వర్ణకుమార్, సర్వేయర్ అప్పలస్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు



గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు మంగళవారం తనిఖీ లు చేశారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించకపోవడం, డార్మెటరీల్లో విద్యుత్ సదుపాయం అంతంత మాత్రమే ఉండడాన్ని, ఫ్యాన్లు సక్రమంగా పనిచేయకపోవడం తదితర సమస్యలను ఆయన గుర్తించారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ లేకపోవ డంతో సిబ్బందితో మాట్లాడుతూ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని లేకుంటే తగిన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

పీఏసీఎస్‌లో డిపాజిట్ల సేకరణ



డిపాజిట్లు సేకరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ సిబ్బంది

బొండపల్లి: గొట్లాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో రైతులు, వ్యాపారులకు రుణాలు ఇవ్వడంతో పాటు డిపాజిట్లు కూడా సేకరిస్తున్నామ ని పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో డిపాజిట్ల సేకరణ కార్య క్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.డిపాజిట్ చేసిన ఖాతాదారులకు బాండ్లు అందజేశారు. దాసన్నపేట డీసీసీబీ శాఖ మేనేజర్ సతీష్‌రాజు మాట్లాడుతూ అన్ని బ్యాంకులు కంటే పీఏసీఎస్‌లే డిపాజిట్‌దారు లకు అధిక వడ్డీని చెల్లిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ సీఈఓ నాయుడు, సూపర్‌వైజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళిలు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: ప్రజా గాయకుడు గద్దర్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు నివాళులర్పించారు. కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో గద్దర్ సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ గుమ్మడి విఠల్‌రావు జన నాట్యమండలితో చిరుదివ్వెగా వెలిగి తర్వాత విప్లవ జ్యోతిగా విరాజిల్లి గద్దర్‌గా మారారన్నారు. ఆయన ప్రజాకవిగా, గాయకుడిగా గళమెత్తి గజ్జె కట్టి, ఎన్నో విప్లవాలకు ఊపిరి పోశారన్నారు. తెలుగు అధ్యాపకురాలు ఆర్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ గద్దర్ అంటే తిరుగుబాటని, ఆయన పీడిత ప్రజల పక్షాన నిలిచిన ఆయుధం అన్నారు.

విజయవంతం చేయండి



శృంగవరపుకోట: ఎంపీడీఓ కార్యాలయంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు



కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

శృంగవరపుకోట/ కొత్తవలస: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఈనెల 10వ తేదీన చేపట్టనున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ సిబ్బంది విజయవంతం చేయాలని ఎస్.కోట ఎంపీడీఓ శేషుబాబు, కొత్తవలస మండలం, వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.గోపాలకృష్ణ కోరారు. సంబంధిత వాల్ పోస్టర్లను ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయంలో, వియ్యంపేట పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం వారు ఆవిష్కరించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపువారికి మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. కొట్టాం వైద్యాధికారి జె.హారిక, ఎస్.కోట ఎంఈఓ నర్సింగరావు, ఐసీడీఎస్ పీఓ ఉమ, నోడల్ ఆఫీసర్ తారకరావు, వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది ఎస్.జగదాంబ, పద్మావతి, ఎస్.ఈశ్వరమ్మ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఐఓ అచ్యుతకుమారి

గజపతినగరం: మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) అచ్యుతకుమారి మంగళవారం తనిఖీలు చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలు,సిబ్బంది పనితీరు, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి, మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట మరుపల్లి వైద్యాధికారులు అనూజ్ రాయ్, సుష్మ, సీహెచ్‌ఓ అప్పలనరసమ్మ, ఈఓ శ్రీనివాసరావు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణ



నామినేషన్ స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారులు

గజపతినగరం: మండలంలోని లోగిశ పంచాయతీ సర్పంచ్, సాలిపేటలో- 1వ వార్డు మెంబర్,, జిన్నాంలో 5వ వార్డు మెంబర్‌కు సంబంధించిన ఉపఎన్నిక ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. లోగిశ ఉన్నత పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్.రమేష్ కుమార్ మంగళవారం నామినేషన్‌లు స్వీకరించారు. సాలిపేట–1వ వార్డుకు గంట్యాడ గురినాయుడు నామినేషన్ వేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లాలబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: అధిక శ్రావణ బహుళ పక్షం అష్టమిని పురస్కరించుకుని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సహస్ర నామ పారాయణం చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

'హిరోషిమా, నాగసాకి' డే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి ఉన్నత పాఠశాలలో రాష్ట్రశాస్త్ర సాంకేతిక మండలి జిల్లా సమన్వయకర్త మిరియాల కృష్ణా రావు ఆధ్వర్యంలో 'హిరోషిమా, నాగసాకి 'డేను మంగళవారం నిర్వహించారు. ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకోవాలని, ఆదిశగానే పయణించాలని సూచించారు. అన్ని దేశాలు స్నేహ భావంతో మెలగినప్పుడే ప్రపంచశాంతి సాధ్యమని అన్నారు. 1945 ఆగస్టు 6న జపాన్‌లోని హిరోషిమా, 9న నాగసాకి నగరాలపై అమెరికా జరిపిన అణుబాంబు దాడుల వల్ల కలిగిన ప్రాణనష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎల్.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శశిభూషణరావు, ఉమ, అరుణ, రవిశంకర్, శంకరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

పల్లెల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



దత్తిరాజేరు: వి.కృష్ణాపురంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి 59 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు, దీర్ఘ కాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యతనిఖీలు చేశారు.

పోతనపల్లిలో ..

శృంగవరపుకోట: మండలంలోని పోతనపల్లి గ్రామంలో కొట్టాం పీహెచ్‌సీ డాక్టర్ జె.హారిక నేతృత్వంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. 13 మంది వైద్యసిబ్బంది ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేశారు.